సాక్షి కామారెడ్డి

శుక్రవారం। 3। జనవరి। 2025



అడవి అన్యాక్రాంతం

ఎల్లారెడ్డి అటవీ ప్రాంతంలో కొందరు ఇష్టారీతిన చెట్లను నరికి వేసి కలపను తరలిస్తున్నారు.

- 9లో ▸



నాణ్యమైన భోజనం పెట్టాలి

విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులు సూచించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0 /10.2

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఏఎస్పీ చైతన్యరెడ్డి



కామారెడ్డి టౌన్‌: నూతనంగా బాధ్యతలు చేపట్టిన అదనపు ఎస్పీ బి చైతన్యరెడ్డి గురువారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పూల మొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఏజీపీగా లక్ష్మీనారాయణమూర్తి



బాన్సువాడ: బాన్సువాడ సివిల్ కోర్టులో అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్(ఏజీపీ)గా లక్ష్మీ నారాయణ మూర్తిని ప్రభుత్వం నియమించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను గురువారం జడ్జి భార్గవికి ఆయన అందజేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూర్తికి అభినందనలు తెలిపారు. న్యాయవాదులు రమాకాంత్, ఖలీల్, దత్తాత్రిరావు, మొగులయ్య తదితరులు ఉన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



నిజాంసాగర్(జుక్కల్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం జుబ్లిహిల్స్‌లోని ఆయన నివాసంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్ పనులకు నిధులు ఇవ్వాలని కోరారు. పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకు వెళ్లారు. సీఎం సానుకూలంగా స్పందించి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంపై హర్షం


కామారెడ్డి టౌన్‌: సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా జనవరి 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవం జరపాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీనిపై టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్, తిరుపతి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సావిత్రిబాయి జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని రెండు దశాబ్దాలకుపైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు. జీవో విడుదల చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి రైల్వే గేట్ మూసివేత

బోధన్‌టౌన్‌: బోధన్ – మోస్రా రోడ్డులో హనుమాన్ టేక్డి కాలనీ వద్ద రైల్వేగేట్‌ను శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూసివేయనున్నట్లు స్టేషన్ మాస్టర్ రాము తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో మూసివేస్తామని బోధన్ నుంచి బెల్లాల్, ఊటపల్లి, మోస్రా వైపు వెళ్లే వాహనదారులు రాకాసీపేట్ మీదుగా, అటువైపు నుంచి వచ్చేవారు ఎరాజీపల్లి మీదుగా రావాలని సూచించారు.

జిల్లాలో యంగ్ టీం!

జిల్లాలో యువ సివిల్ సర్వీసెస్ అధికారులు పాలనలో తమదైన ముద్ర వేస్తున్నారు. కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్‌వో, బాన్సువాడ సబ్ కలెక్టర్ తమ పరిధిలో నిత్యం తనిఖీలు చేస్తూ సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. పథకాలు ప్రజలకు చేరేలా చూస్తున్నారు. వీరికి తోడు ఇటీవల యువ ఏఎస్పీగా చైతన్యరెడ్డి బాధ్యతలు చేపట్టారు.



- ఐదుగురు సివిల్ సర్వీసెస్ యువ అధికారులు
- వీరితో పాటు ఇద్దరు అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ
- మరో ఇద్దరు ఆర్డీవోలు, ఇద్దరు డీఎస్పీలు
- జిల్లా పరిపాలనలో పూర్తిస్థాయి అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా పరిపాలనలో యువరక్తం ఎక్కువగా కనిపిస్తోంది. ముఖ్యంగా కలెక్టర్‌గా యువ ఐఏఎస్ అధికారి ఆశిష్ సంగ్వాన్ ఉండగా, ఎస్పీగా యువ ఐపీఎస్ అధికారి సింధు శర్మ, జిల్లా అటవీ అధికారి(డీఎఫ్‌వో)గా ఐఎఫ్‌ఎస్ అధికారి నిఖిత పనిచేస్తున్నారు. వీరికి తోడుగా ఇటీవలే బాన్సువాడకు సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి కిరణ్మయి వచ్చి చురుగ్గా పనిచేస్తున్నారు. తాజాగా కామారెడ్డికి అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ)గా ఐపీఎస్ అధికారి చైతన్యరెడ్డి వచ్చారు. సివిల్ సర్వీసెస్‌కు సంబంధించి జిల్లాలో పనిచేస్తున్న ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారులు ఐదుగురూ యంగ్ ఆఫీసర్లే కావడం విశేషం. వీరికి తోడుగా జిల్లా పరిపాలనలో అపార అనుభవం ఉన్న అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీనివాస్‌రెడ్డి, మరో అదనపు కలెక్టర్ వి విక్టర్ (రెవెన్యూ) పనిచేస్తున్నారు. అలాగే జిల్లా పోలీసు శాఖలో అదనపు ఎస్పీగా కె నర్సింహారెడ్డి ఉన్నారు. గతంలో ఒక అధికారి ఉంటే ఒక పోస్టు ఖాళీగా ఉండేది. ఈ సారి కీలకమైన పోస్టులన్నీ భర్తీ అయ్యాయి. ఇద్దరు ఐఏఎస్‌లు అది కూడా యువ అధికారులు ఉండడం, ఇద్దరు ఐపీఎస్‌లు వాళ్లు కూడా యంగ్ ఆఫీసర్లు ఉండడంతో పరిపాలనలో దూకుడుగా ఉండేందుకు అవకాశాలున్నాయి. ఇదే సమయంలో కామారెడ్డిలో ఆర్డీవోగా రిటైర్మెంట్‌గా దగ్గరలో ఉన్న రంగనాథ్‌రావు, ఎల్లారెడ్డి ఆర్డీవోగా ప్రభాకర్ పనిచేస్తున్నారు. బాన్సువాడ, ఎల్లారెడ్డిలో డీఎస్పీలు ఉన్నారు. మొత్తంగా చిన్న జిల్లా అయినా ఇద్దరు ఐఏఎస్‌లు, ఇద్దరు ఐపీఎస్‌లు, ఒక ఐఎఫ్‌ఎస్, ఇద్దరు అదనపు కలెక్టర్లు, ఒక అదనపు ఎస్పీ ఉండడం విశేషం. వీటికి తోడు చాలా శాఖల్లో కీలకమైన విభాగాలకు యువ అధికారులు ఉన్నారు.

అనుభవమున్న అధికారులూ ఉన్నారు

జిల్లాలో యువ అధికారులతో పాటు అనుభవం ఉన్న వారు సైతం పనిచేస్తున్నారు. అనుభవజ్ఞుడైన జిల్లా అదనపు కలెక్టర్ డి శ్రీనివాస్‌రెడ్డి స్థానిక సంస్థలకు సంబంధించి పరిపాలనా వ్యవహారాలు చూస్తున్నారు. మరో అదనపు కలెక్టర్ వి విక్టర్ రెవెన్యూ, సివిల్ సప్లయిస్ వంటి వాటిని చూస్తున్నారు. అలాగే కామారెడ్డి, ఎల్లారెడ్డిలో ఆర్డీవోలు రంగనాథ్‌రావు, ప్రభాకర్ పనిచేస్తున్నారు. పోలీసు శాఖలో బాన్సువాడ, ఎల్లారెడ్డి డీఎస్పీలు పనిచేస్తున్నారు.

జిల్లా స్థాయిలో అధికారులు చాలా మంది చురుకైన, అనుభవం కలిగిన అధికారులున్నారు. రెండు, మూడు శాఖలు తప్ప అన్ని శాఖలకు రెగ్యులర్ అధికారులు ఉండడంతో పరిపాలనకు అనుకూల వాతావరణం ఉంది. యువ అధికారుల సారథ్యంలో జిల్లా ప్రగతి పరుగులు తీస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు.

పనితీరుతో గుర్తింపు

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బాధ్యతలు చేపట్టిన తొలి రోజు నుంచే తనదైన శైలిలో పనిచేస్తూ పరిపాలనలో తనదైన వేసుకున్నారు. ముఖ్యంగా కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ విధానం అమలు చేయడం ద్వారా ఉద్యోగులు సమయపాలన పాటించేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను తనిఖీ చేస్తూ పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకున్నారు. ధరణి సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతూ వేలాది దరఖాస్తులను పరిష్కరించారు. ఇంటర్ ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ఫోకస్ చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలుతో పాటు తనదైన శైలిలో పనిచేస్తూ దూసుకుపోతున్నారు.

- ఎస్పీ సింధుశర్మ పోలీసు శాఖపై తనదైన ముద్ర వేసుకున్నారు. కేసుల నమోదు నుంచి పరిశోధన, నేరస్తులకు శిక్షలు పడేవరకు ఎప్పటికప్పుడు అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. జిల్లా అటవీ అధికారి నిఖిత అటవీ అభివృద్ధి, అడవుల రక్షణ విషయంలో నిక్కచ్చిగానే వ్యవహరిస్తున్నారు. బాన్సువాడ అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కిరణ్మయి తన పరిధిలోని ఆయా మండలాల్లో నిరంతరం పర్యటిస్తున్నారు. వెనకబడిన ప్రాంతమైన బిచ్కుందలో ప్రజావాణిని కూడా ప్రారంభించి ప్రజల విన్నపాలు విన్నారు. మరో యువ ఐపీఎస్ అధికారి చైతన్య నిన్నమొన్ననే ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టి సబ్ డివిజన్ పరిధిలో నేరాలు, పరిస్థితులను అధ్యయనం చేస్తున్నారు. మొత్తం మీద జిల్లాలో యువ అధికారులతో మంచి టీం ఏర్పడింది. అందరూ సమన్వయంతో పనిచేస్తే మరిన్ని మంచి ఫలితాలు సాధించవచ్చని భావిస్తున్నారు.

ఏకసభ్య కమిషన్‌కు వినతుల వెల్లువ



మాట్లాడుతున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్

- ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయాలను తెలిపిన ఆయా వర్గాల ప్రజలు

నిజామాబాద్ అర్బన్‌: ఎస్సీ వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ బహిరంగ విచారణ కోసం గురువారం జిల్లా కేంద్రానికి వచ్చింది. హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ కలెక్టరేట్‌లో విచారణ చేపట్టింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకుల నుంచి వర్గీకరణపై వినతులు స్వీకరించారు. మాదిగలు, మాలలు, జంగములు, చిందులు, బేడ బుడగ జంగములు, బైండ్ల, మంగులతోపాటు వివిధ వర్గాల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేస్తూ విజ్ఞాపనలు అందజేశారు. బుడగ జంగాలు, బైండ్ల, చిందులు తదితరులు తమ వృత్తిని తెలుపుతూ సంప్రదాయ వేషధారణతో కలెక్టరేట్‌కు తరలివచ్చి కమిషన్‌కు తమ స్థితిగతులను తెలిపారు. సామాజిక–ఆర్థిక వెనుకబాటు కారణంగా విద్య, ఉద్యోగాలు తదితర రంగాల్లో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ప్రస్తావిస్తూ పలువురు వర్గీకరణ ఆవశ్యకతను చెప్పగా, వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, వర్గీకరణ పేరుతో ఎస్సీలను విభజించడం సబబు కాదని మరికొందరు కమిషన్‌కు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మొత్తం 555 వినతులు అందాయి.

ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందిస్తాం

ఎస్సీ వర్గీకరణపై అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ పేర్కొంది. షమీమ్ అక్తర్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అంశంపై అన్ని వర్గాల వారి అభిప్రాయాలను తెలుసుకుని, క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను కలుపుకుని ఇప్పటివరకు 9 జిల్లాల్లో అభిప్రాయ సేకరణ పూర్తయ్యిందని తెలిపారు. వర్గీకరణ అంశంతోపాటు సామాజిక స్థితిగతులకు సంబంధించి షెడ్యూల్డ్ కులాలకు చెందిన అన్ని వర్గాలవారు ఎలాంటి ఒత్తిడి లేకుండా నిర్భయంగా కమిషన్‌కు తమ అభిప్రాయాలను వెల్లడించొచ్చని సూచించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల డీఎస్‌సీడీవోలు నిర్మల, రజిత పాల్గొన్నారు.



వినతిపత్రం ఇవ్వడానికి వేషధారణలో వచ్చిన కామారెడ్డికి చెందిన హోలియ దాసరి కులస్తులు

ముందుకు సాగని మరమ్మతులు!

- నిజాంసాగర్ జల విద్యుత్ కేంద్రం పనులకు రూ.12 కోట్లు మంజూరు
- పరికరాలు దొరకక నిలిచిన టర్బయిన్ల రిపేర్లు

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద గల జల విద్యుత్ కేంద్రంలో టర్బయిన్ల మరమ్మతు పనులు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన పరికరాలు దొరకకపోవడంతో పనులు ఆగిపోయాయి. నిజాంసాగర్ ప్రాజెక్టుకు అనుసంధానంగా 1954లో హెడ్‌స్లూయిస్ వద్ద 15 మెగావాట్ల సామర్థ్యంతో జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇంగ్లాండ్ నుంచి మూడు టర్బయిన్లను తీసుకు వచ్చారు. ఒక్కొక్క టర్బయిన్ ద్వారా రోజుకు 5 మెగావాట్ల కరెంట్ ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉన్నాయి. 1974లో మూడో టర్బయిన్ పాడైంది. అప్పటి నుంచి రెండు టర్బయిన్ల ద్వారానే విద్యుదుత్పత్తి చేపడుతున్నారు. ఆ రెండు టర్బయిన్లు అప్పుడప్పుడు సాంకేతిక సమస్య ఎదురవడంతో పాటు హైడ్రో ఎలక్ట్రిసిటి పవర్‌కు ఇబ్బందులు తలెత్తున్నాయి. అయితే జల కేంద్రంలో టర్బయిన్ల ఆధునికీకరణతో పాటు ఆటోమెటిక్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా జల విద్యుదుత్పత్తికి పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జెన్‌కో అధికారులు ప్రతిపాదించారు. దీంతో జలవిద్యుత్ కేంద్రం ఆధునికీకరణ పనుల కోసం ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో గతేడాది నుంచి కేంద్రం ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. టర్బయిన్ల మరమ్మతులు, కాలం చెల్లిన వైర్ల తొలగింపు, పరికరాల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. అయితే టర్బయిన్లకు సంబంధించిన పరికరాలు దేశంలో లభ్యం కాకపోవడంతో పనులకు ఆటంకం కల్గుతుంది. ఇంగ్లాండ్ నుంచి పరికరాలు కొనుగోలు చేస్తే తప్పా టర్బయిన్ల మరమ్మతులు పూర్తయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. పరికరాలు లేకపోవడంతో ఆరు నెలలుగా టర్బయిన్ల పనుల జాడ కరువైంది. కాగా పనుల్లో జాప్యానికి గల కారణాలను సంబంధిత అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు.



కేంద్రంలోని టర్బయిన్లు

జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్‌: నూతన సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగులు సమష్టి కృషితో జిల్లాను అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. నూతన సంవత్సర సందర్భంగా విషెస్ తెలిపే కార్యక్రమాన్ని గురువారం కలెక్టరేట్ సమావేశపు హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత సంవత్సరంలో ఉద్యోగుల సహకారంతో మంచిపేరు సంపాదించామని, అదే స్ఫూర్తితో కొత్త ఏడాదిలో పని చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత, అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు పరుచుటలో ప్రతీ ఉద్యోగి భాగస్వాములు కావాలని సూచించారు. దాదాపు రూ.వెయ్యి కోట్లతో ధాన్యం సేకరణలో రాష్ట్రంలోనే రెండో స్థానం నిలిచామని, యాసంగిలో ప్రథమ స్థానంలో నిలవాలని సూచించారు. గత సంవత్సరం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు చేపట్టి సౌకర్యాలు కల్పించామని గుర్తుచేశారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో డైట్ చార్జీలు ప్రభుత్వం పెంచిందని, దీంతో విద్యార్థులకు నాణ్యమైన శుభ్రమైన రుచికరమైన భోజనం అందిస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, చిత్రంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి

హాస్టళ్లను తనిఖీ చేయాలి

మండల ప్రత్యేక అధికారులు క్షేత్ర పర్యటనలో వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాలను పరిశీలించాలన్నారు. అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి విక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను అమలు పరచాలని అన్నారు. కలెక్టర్ నేతృత్వంలో ఉద్యోగులు సమష్టి బాధ్యతతో పనిచేయాలన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్ పర్యవేక్షణ బాధ్యతను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌లకు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహించామని, ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనులు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా రవాణా శాఖ రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు కలెక్టర్, అదనపు కలెక్టర్లకు నోట్ పుస్తకాలు, పెన్నులు, బ్లాంకెట్‌లు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీపీవో రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా రవాణా శాఖాధికారి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోరా!

- బల్దియా కౌన్సిల్ సమావేశంలో అధికారులపై సభ్యుల ఆగ్రహం

కామారెడ్డి టౌన్‌: అధికారుల తీరుపై మున్సిపల్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సమావేశపు హాల్‌లో జరిగింది. కాగా సమావేశానికి ముందు చైర్‌పర్సన్ ఛాంబర్‌లో గంటన్నర పాటు కొందరు సభ్యులు రహస్యంగా సమావేశం నిర్వహించి కౌన్సిల్ హాల్‌లోకి హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ఉదయం 10:30 గంటలకు ప్రారంభించాల్సిన సమావేశాన్ని మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభించారు. సమావేశం ప్రారంభం కాగానే 13వ వార్డు కౌన్సిలర్ శంకర్‌రావు పని చేయని వీధి లైట్లను తీసుకు వచ్చి చైర్‌పర్సన్ పోడియం ముందు వేసి నిరసన తెలపగా వైస్ చైర్‌పర్సన్ వనితతో పాటు మిగతా సభ్యులు సైతం మద్దతు తెలిపారు. వార్డుల్లో నెల రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని.. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కమిషనర్ స్పందన, డీఈ వేణుగోపాల్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డుల్లో చీకటి ఉండటంతో చోరీలు జరుగుతున్నాయని, అయినా పట్టించుకోరా అంటూ మండిపడ్డారు. ఇప్పటివరకు ముగ్గురు కమిషనర్లు మారినా సమస్యను పరిష్కరించడం లేదని అసహనం వ్యక్తం చేశారు.

తక్షణమే జనరల్ ఫండ్ నుంచి రూ.10 లక్షలతో నూతన వీధి దీపాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో సమస్య ఏర్పడిందని ఆయనను పిలిచి మాట్లాడతామని కమిషనర్ సమాధానం చెప్పారు.



చైర్‌పర్సన్ పోడియం వద్ద పని చేయని వీధి దీపాలను వేసిన కౌన్సిలర్లు

వేతనాల పెంపు నిలిపేశాం..

కార్మికుల పెండింగ్ వేతనాలు, నలుగురు కార్మికులకు వేతనం పెంపు, కౌన్సిలర్ల 8 నెలల పెండింగ్ గౌరవ వేతనం, మున్సిపల్ పాత సామగ్రి దొంగతనం అంశాలపై చర్చ జరిపారు. అధికారులను ప్రశ్నించగా కమిషనర్ స్పందించి వేతనాలు వెంటనే చెల్లిస్తున్నామని, నలుగురి వేతనాల పెంపు నిలిపివేసినట్లు తెలిపారు. పాత సామగ్రి దొంగతనం ఘటనపై కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలుంటాయని పేర్కొన్నారు. తొమ్మిది ఎజెండా అంశాలతోపాటు 8 టేబుల్ ఎజెండా అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ వనిత, అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

వారాంతంలో పండుగలు!


- ఉద్యోగులకు అనుకూలం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : నూతన సంవత్సరంలో వారాంతాల్లోనే పండుగలు ఎక్కువగా ఉన్నాయి. ఆదివారానికి ఒక రోజు ముందో, వెనకో పండుగలు వస్తే చాలు రెండు, మూడు రోజులు టూర్లు వెళ్లడానికి చాలా మంది ప్లాన్ వేసుకుంటారు. అలాంటి వారికి అనుకూలంగా ఈ ఏడాది పండుగలు వచ్చాయి.

- జనవరిలో మూడు రోజుల పాటు జరిగే సంక్రాంతి 12, 13, 14 తేదీల్లో అంటే ఆది, సోమ, మంగళవారాల్లో ఉంది. రెండో శనివారం 10వ తేదీ, ఆదివారం 11 కలిసి రావడంతో ఐదు రోజులు సెలవులు దొరుకుతాయి.
- మార్చి 14న (శుక్రవారం) హోలీ పండుగ వచ్చింది. దీంతో 15 శనివారం, 16 ఆదివారం కలిసివచ్చేలా ప్లాన్ చేసుకోవచ్చు.
- మార్చి 30 ఆదివారం ఉగాది, 31న రంజాన్ సెలవులు వచ్చాయి.
- ఏప్రిల్ 5 (శనివారం) బాబూ జగ్జీవన్‌రాం జయంతి, 6 ఆదివారం కలిసి వచ్చాయి.
- ఏప్రిల్ 14 సోమవారం అంబేడ్కర్ జయంతి ఉంది.
- జూన్ 7 (శనివారం) బక్రీద్ పండుగ వచ్చింది.
- జూలై 21 సోమవారం బోనాల సెలవు.
- ఆగస్టు 9 శనివారం రాఖీ పౌర్ణమి కాగా, మరుసటి రోజు ఆదివారం కలిసి వస్తుంది.
- ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం శుక్రవారం రాగా, 16న శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి కలిసి వచ్చాయి. మరుసటి రోజు ఆదివారం కావడంతో మూడు రోజులు ఎటైనా వెళ్లడానికి ప్లాన్ చేసుకోవచ్చు.
- సెప్టెంబర్ 5 శుక్రవారం ఈద్ ఏ మిలాద్ పండుగ సెలవు. మరుసటి రోజు శనివారం సెలవు తీసుకుంటే ఆదివారంతో కలిసి మూడు రోజులు ఎంజాయ్ చేయొచ్చు.
- అక్టోబర్ 20 సోమవారం దీపావళి ఉంది.
- డిసెంబర్ మాసంలో 25 గురువారం, 26 శుక్రవారం రెండు రోజులు పాటు క్రిస్మస్ వేడుకలు జరుగుతాయి. శని, ఆదివారం కలుపుకుంటే నాలుగు రోజులు ట్రిప్ వెళ్లొచ్చు.

క్లుప్తంగా

కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్ కోసం కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, వరదకాలువ ద్వారా 5వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 700 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 200 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 470 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, ముంపు గ్రామాల ఎత్తిపోతల పథకాలకు 312 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 475 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1089.20 (74 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

నేడు పాసింగ్ అవుట్ పరేడ్

డిచ్‌పల్లి: మండలంలోని రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడవ బెటాలియన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న టీజీఎస్పీ కానిస్టేబుళ్లకు శుక్రవారం (3న) పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించనున్నట్లు కమాండెంట్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఎస్పీ ట్రెయినీ కానిస్టేబుళ్లగా ఎంపికైన 463 మందికి గత 9 నెలలుగా డిచ్‌పల్లి 7వ బెటాలియన్‌లో వివిధ అంశాలలో శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వారి శిక్షణ పూర్తయినందున శుక్రవారం పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించి వారికి ఆయా బెటాలియన్లలో విధులు కేటాయింపునకు సంబంధించి నియామక ఉత్తర్వులను అందజేస్తారని తెలిపారు. ఈ పాసింగ్ అవుట్ పరేడ్‌లో ముఖ్య అతిథిగా నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సింధు శర్మ పాల్గొంటారని ఆయన తెలిపారు.

రోడ్డు పనులు పూర్తిచేయించాలి



వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రహదారుల పనులను పూర్తి చేయించాలని వేల్పూర్ మార్కెట్ కమిటీ పాలవర్గం సభ్యులు కోరారు. ఈమేరకు వారు గురువారం డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి విన్నవించారు. పనులను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు. అలాగే మంత్రికి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, ముప్కాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పతకాలు

నిజామాబాద్ నాగారం: రాష్ట్రస్థాయి సీఎం కప్ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన కుస్తీ క్రీడాకారులు పతకాలు సాధించారు. హన్మకొండలో జరుగుతున్న పోటీల్లో రెండు బంగారు, రెండు రజత, ఒక కాంస్య పతకం సాధించారు. క్రీడాకారులను డీఎస్‌డీవో ముత్తెన్న అభినందించారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీకి ఎంపిక

నిజామాబాద్ నాగారం: జాతీయస్థాయి సీనియర్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు జిల్లాకు చెందిన ఉదయ్ ఎంపికయ్యా రు. ఈ నెల 5 నుంచి 12వరకు భవనగర్‌లో జరగనున్న టోర్నీలో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, ఆర్గనైజర్ బొబ్బిలి నరేష్ ఉదయ్‌ను అభినందించారు.

ఉన్నతాధికారులను కలిసిన టీజీవో, టీఎన్‌జీవోలు

కామారెడ్డి అర్బన్: కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఉన్నతాధికారులను టీజీవోలు, టీఎన్‌జీవులు వేర్వేరుగా కలిశారు. ఈసందర్భంగా వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఉద్యోగులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

భిన్నాభిప్రాయాలు..

- ఎస్సీ వర్గీకరణ కావాలన్న మాదిగ సంఘాలు.. వద్దన్న మాల సంఘాలు..



రిటైర్డ్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



వినతిపత్రం అందజేస్తున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు

నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ వర్గీకరణపై బహిరంగ విచారణ చేపట్టేందుకు వచ్చిన ఏకసభ్య కమిషన్ ఎదుట దళిత సంఘాలు, నాయకులు, ఆయా వర్గాల ప్రజలు తమ అభిప్రాయాలను తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందేనని మాదిగ సంఘాలు, వద్దని మాల సంఘాల నాయకులు వినతి పత్రాలు అందజేశారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన దళితులతోపాటు ఆయా వర్గాల ప్రజలు, దళిత సంఘాల ప్రతినిధులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్‌కు తమ అభిప్రాయాలను తెలుపుతూ వినతిపత్రాలు అందజేశారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కనక ప్రమోద్ మాదిగ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్ మాదిగ యువజన సంఘం నాయకులు మొదట కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. 1994లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం నుంచి మాదిగ హక్కుల కోసం మాదిగ ఉప కులాల కోసం నిరంతరం మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో పోరాడుతోందన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును తక్షణమే అమలు చేయాలని మాదిగ జేఏసీ జిల్లా చైర్మన్ బర్కుంట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వర్గీకరణ వెంటనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ యువజన సంఘం నాయకులు సంతోష్ విన్నవించగా, ఎస్సీ వర్గీకరణ అవసరం లేదని, అందరికీ సమానమైన రిజర్వేషన్ అందుతున్నాయని ఎస్సీలను విడదీయొద్దని జిల్లా మాల సంఘం నాయకులు ఏకసభ్య కమిషన్‌కు విన్నవించారు. మాలసంఘం నాయకులు ఎల్లయ్య తదితరులున్నారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు నాగభూషణం ఆధ్వర్యంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నా యకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వర్గీకరణ చేపట్టి మాదిగలను ఆదుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు నాంపల్లి వి న్నవించగా, వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వా గతిస్తున్నామని రాష్ట్ర మోచీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముత్యం, ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఏకసభ్య కమిషన్‌కు తెలిపారు.

వర్గీకరణపై తక్షణమే సుప్రీం కోర్టు తీర్పును కొట్టివేయాలని తెలంగాణ మాలసంఘం వ్యవస్థాపకుడు సంతోష్ ఏకసభ్య కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు.



ర్యాలీగా వస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న దండోర నాయకులు

హొలియ దాసరి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

కామారెడ్డి జిల్లా దేవునిపల్లికి చెందిన హొలియ దాసరి సంక్షేమ సంఘం సభ్యులు తమ వృత్తి వేషధారణలో వచ్చి వినతిపత్రం అందజేశారు. కళాకారులకు వయో పరిమితితో సంబంధం లేకుండా పెన్షన్లు మంజూరు చేయాలని కోరా రు. రాత్రిపూట వీధి భాగోతం, యక్షగానం, న త్య ప్రదర్శనలు ఇచ్చే తమ జీవితాలు దుర్భారంగా ఉన్నాయని ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పోచయ్య, చిన్న నర్సింలు,నల్ల పోచయ్య, నడిపి పోచ య్య, పెద్ద సాయిలు, ముత్తయ్య, గంగయ్య, పోచయ్య తదితరులున్నారు. తమను గ్రూప్ ఏలో చేర్చాలని కామారెడ్డి చెందిన బుడగ జంగం సంక్షేమ సంఘం సభ్యులు కోరారు.

కవితల పోటీల్లో బహుమతులు



విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): కెనడా దేశం కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా పిల్లల కోసం వెలువడుతున్న మాసపత్రిక 'గడుగ్గాయ్' ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి కవితల పోటీల్లో మండలంలోని సిర్పూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. గురువారం పాఠశాలలో విద్యార్థులను హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ తెలుగు విద్యార్థులందరికీ కవితా పోటీలను గత నెలలో నిర్వహించారని, అందులోభాగంగా తమ పాఠశాల విద్యార్థులు కవితలు పంపారని తెలిపారు. జనవరి 1న విజేతల జాబితాను విడుదల చేశారన్నారు. పదోతరగతి చదువుతున్న టి అక్షయ, జె రచన, పి నందిని, తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎం మాధురి, ఎం మేఘన, ఏడో తరగతి విద్యార్థులు డి సుశాంత్, ఎస్ చేత్ర బహుమతులను గెలుచుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు కవితా రచనలో మార్గదర్శనం చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ కాసర్ల నరేశ్‌రావును అభినందించారు. ఉపాధ్యాయులు శ్యా మల, మోహన్, గాయత్రి నీలేశ్, వందన, అక్బర్ బాషా, డాక్టర్ హజారే శ్రీనివాస్, లలిత పాల్గొన్నారు.

తెయూ సమాచారం

తెయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పబ్లికేషన్‌సెల్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని గురువారం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ.. బోధన, బోధనేతర సిబ్బంది సహకారం, సమన్వయంతో పని చేసి తెలంగాణ యూనివర్సిటీని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో పబ్లికేషన్ సెల్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, కంట్రోలర్ అరుణ, యూజీసీ కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఆర్ట్స్ డీన్ లావణ్య, అధ్యాపకులు అపర్ణ, రాంబాబు, మహేందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, సూపరింటెండెంట్ భాస్కర్, ఇంజనీర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో గురువారం జాతీయ సదస్సు బ్రోచర్‌ను వర్సిటీ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఐసీఎస్ఎస్ఆర్ సౌత్ సెంట్రల్ రీజియన్ సహకారంతో ఫిబ్రవరి 20, 21న రెండు రోజుల పాటు సౌత్ క్యాంపస్‌లో సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో 'యూత్ అండ్ సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, పోస్టరింగ్ ది క్స్‌జెనరేషన్ ఆఫ్ చేంజ్ మేకర్స్ ఇన్ ఇండియా (వైఎస్ఈ-ఎఫ్ఎన్‌జీసీఐ-2025)' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సులో వివిధ రంగాలకు చెందిన నిపుణుల ప్రసంగాలు, పరిశోధక విద్యార్థుల పరిశోధన పత్రాల సమర్పణ ఉంటుందని కన్వీనర్ వీరభద్రం తెలిపారు. రాజేశ్వరి, అంజయ్య, సోషల్‌సైన్స్ డీన్ ఘంటా చంద్రశేఖర్, కంట్రోలర్ అరుణ, ప్రిన్సిపాల్ ఆరతి తదితరులు పాల్గొన్నారు.

టూటా ఆధ్వర్యంలో వీసీకి శుభాకాంక్షలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వైస్ చాన్స్‌లర్ టి యాదగిరిరావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, రాజేశ్వరి, జి బాలకిషన్, ఎ నాగరాజు, జమీల్ అహ్మద్, శిరీష బోయపాటి, వాసం చంద్రశేఖర్, వీరభద్రం, అంజయ్య, అబ్దుల్ ఖవి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫైళ్లకు మోక్షం



సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ అర్బన్: విద్యాశాఖలో పెండింగ్ ఫైళ్లలకు మోక్షం లభించింది. 'విద్యాశాఖలో కదలని ఫైళ్లు' శీర్షికన గురువారం 'సాక్షి' పత్రికలో ప్రచురితమైన కథనానికి డీఈవో స్పందించి ఫైళ్లను క్లియర్ చేశారు. సర్వీస్ మేటర్లు, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన ఫైళ్లను క్లియర్ చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ నాగజ్యోతిని ఫైళ్లను పూర్తిగా పరిశీలన చేయాలని ఆదేశించారు.

22 వరకు పరీక్ష ఫీజుచెల్లించండి

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్ పరీక్షల ఫీజును ఈనెల 22 వరకు చెల్లించాలని డీఈవో అశోక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ రుసుముతో ఈ నెల9 నుంచి 22 వరకు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పదోతరగతి వారు ప్రతి సబ్జెక్టుకు రూ. 100, ఇంటర్ వారు ప్రతి సబ్జెక్టుకు రూ. 150 రూపాయలు, ఇంటర్ ప్రయోగ పరీక్షలకు ప్రతి సబ్జెక్టుకు రూ. 150 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు రూ. 25 అపరాధ రుసుముతో, ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 3 వరకు రూ. 50 అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని అన్నారు. ఫిబ్రవరి 4 నుంచి 6 వరకు తాత్కాల్ రూపంలో పరీక్ష ఫీజును పదో తరగతి వారు రూ. 500, ఇంటర్ వారు రూ. 1000 అదనంగా చెల్లించి ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

ప్రశాంతంగా టెట్ పరీక్ష

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో గురువారం ప్రశాంతంగా టెట్ పరీక్ష జరిగింది. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. కేవలం 150 మందికే పరీక్ష జరిగింది. మిగతా వారందరికీ హైదరాబాద్ తదితర ప్రాంతాలలో సెంటర్లు కేటాయించడంతో ఇబ్బందులు పడ్డారు.

నూతన భూభారతి చట్టానికి ట్రెసా మద్దతు



సీఎం రేవంత్‌రెడ్డితో ట్రెసా ప్రతినిధులు

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ రైతాంగ భూయాజమాన్య హక్కుల పరిరక్షణ లక్ష్యంతో తీసుకొచ్చిన నూతన భూభారతి ఆర్వోఆర్ చట్టానికి తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) తరఫున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని సంఘ సభ్యులతో కలిసి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్‌ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో ట్రెసా ప్రధాన కార్యదర్శి కె గౌతమ్ కుమార్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, ఉప తహసీల్దార్ రంజిత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నాయకులు

నిజామాబాద్ సిటీ/డిచ్‌పల్లి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం జిల్లా కాంగ్రెస్ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిలు ముఖ్యమంత్రిని కలిశారు. వీరితోపాటు వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సారెడ్డి, ముప్కాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యం రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైడి రవి తదితరులు ఉన్నారు.

నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ



కామారెడ్డిలో క్యాలెండర్లలను ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి వరప్రసాద్

కామారెడ్డి క్రైం: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో గురువారం న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్లను జిల్లా జడ్జి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ ఆవిష్కరించారు. అదనపు జిల్లా న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్, సెక్రెటరీ డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నాగరాణి, సీనియర్ సివిల్ జడ్జి సుమలత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, సంఘం అధ్యక్షుడు భుజంగ్ రావు, ప్రధాన కార్యదర్శి నిమ్మ వెంకట్ రెడ్డి, కోశాధికారి నాగేందర్, సహాధ్యక్షులు శ్రీధర్, ఉపాధ్యక్షులు సయ్యద్ రషీద్ అలీ, రమేష్ గౌడ్ , సాయిబాబు, చంద్రసేన్ రెడ్డి, మారుతి, సాయి కృష్ణ, నిఖిల్ రెడ్డి, మహిళా ప్రతినిధులు కరుణశ్రీ, శాంతిశ్రీ, రజనీప్రియ, మమత, సంధ్యారాణి, అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి శ్రీదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో..

నిజాంసాగర్(జుక్కల్)/మాచారెడ్డి:నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలో గురువారం పీఆర్టీయూ క్యాలెండర్లు, వాల్ పోస్టర్లను పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ పటేల్ ఆవిష్కరించారు. జంగిటి సంతోష్, కలకొండ నారాయణ, సురేందర్, వెంకట్రాంరెడ్డి, బాస్కర్‌గౌడ్, వెంకటరమణ తదితరులు ఉన్నారు. అలాగే పాల్వంచ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘం నాయకులు క్యాలెండర్లను ఆవిష్కరించారు. హెచ్‌ఎం గోవర్ధన్ రెడ్డి, బాల్‌రాజు, అంతయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

గురు గ్రూప్ ఆఫ్ కాలేజీల ఆధ్వర్యంలో..

కామారెడ్డి టౌన్:జిల్లా కేంద్రంలో గురువారం గురు గ్రూప్ ఆఫ్ కాలేజీల నూతన సంవత్సర క్యాలెండర్ సంస్థ ప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం పీజీఆర్ డిగ్రీ కళాశాలలో అయ్యప్ప మహాపడి పూజను నిర్వహించారు. గురువేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అయ్యప్ప ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

షీటీం సేవలను ఉపయోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై శివకుమార్

నిజాంసాగర్(జుక్కల్): అత్యవసర సమయంలో షీటీం సేవలను బాలికలు ఉపయోగించుకోవాలని స్థానిక ఎస్సై శివకుమార్ సూచించారు. గురువారం అచ్చంపేట ఆదర్శ మోడల్ పాఠశాలలో షీటీం సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలికలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పోకిరీల బెడదతో పాటు బస్టాండ్లు, ప్రధాన చౌరస్తాల్లో యువకుల వేధింపుల నివారణకు షీటీంలు దోహదపడతాయన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి



కామారెడ్డి క్రైం: సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని పాత జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాల యజమానులతో గురువారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఆవశ్యకత ఎంతగానో ఉంటుందన్నారు.కెమెరాల ఏర్పాటు కోసం తమ వంతు సహకారం చేయాలని వ్యాపారులకు సూచించారు. వ్యాపారులు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలపడంతో వారికి ధన్యవాదాలు తెలిపారు.


ఇందల్వాయి ఎస్సైపై ఫిర్యాదు

ఇందల్వాయి:ఇందల్వాయి ఎస్సై మనోజ్ కుమార్ పై లింగాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సంతోష్ రెడ్డి, దగ్గి సతీష్‌లు గురువారం మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. మండలంలోని ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నాడని, కేసుల విషయంలో ప్రజలను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాడని అతడిపై చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్సైని వివరణ కోరగా ఆరోపణలు అన్ని అవాస్తవమని, తనపై అక్కసుతోనే ఫిర్యాదు చేశారన్నారు.

టోల్‌ప్లాజా సిబ్బందిపై..

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో ఉన్న టోల్‌ప్లాజా సిబ్బందిపై కామారెడ్డి పట్టణానికి చెందిన రాజశేఖర్ గురువారం భిక్కనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజశేఖర్ తన కారులో కామారెడ్డి నుంచి హైదరాబాద్ వెళ్తుండగా బుధవారం అర్ధ రాత్రి టోల్‌ప్లాజా గేటవద్ద సాంకేతిక లోపంతో ఆగిపోయింది. మెకానిక్‌తో మరమ్మతులు చేయిస్తుండగా తనపై టోల్‌ప్లాజా సిబ్బంది దాడి చేసి, ఇబ్బందికి గురిచేసినట్లు పేర్కొన్నారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

వాహనదారులకు కౌన్సెలింగ్



కామారెడ్డి క్రైం: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఇటీవల డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన కొందరికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపకూడదని పట్టణ ట్రాఫిక్ ఎస్సై మహేష్ సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మరోసారి మద్యం తాగి వాహనం నడపమని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సై రాజారాం, ఏఎస్సై కళాధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుందలో గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. లేదంటే కేసులు నమోదు చేస్తామన్నారు. డిసెంబర్ 31న నాలుగు డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

సెల్‌ఫోన్ల అందజేత



బోధన్‌టౌన్: పట్టణ పీఎస్ పరిధిలో పలు చోట్ల పోగొట్టుకున్న 15 మంది బాధితులకు వాటిని రికవరీ చేసి అందించినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ గురువారం తెలిపారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే పీఎస్‌లో ఫిర్యాదు చేసి సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు.

క్రైం కార్నర్

చేపలవేటకు వెళ్లి ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్: కాలువలో చేపలవేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..

మహారాష్ట్రకు చెందిన కెశవ్ గంగాధర్‌బోస్లే(29) బతుకు దెరువు కోసం ఆరు నెలల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి ఆలూర్ మండలం దేగాం గ్రామానికి వచ్చి జీవనం సాగిస్తున్నాడు. కాగ బుధవారం ఉదయం దేగాం శివారులో గల నీటి కాలువలో చేపలు పట్టేందుకు గంగాధర్ వెళ్లగా ప్రమాదశావత్తు నీటిలో పడ్డాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ట్రాఫిక్ పీఎస్‌లో బైక్ చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో బైక్ చోరీకి గురైంది. మూడు రోజుల క్రితం నగరానికి చెందిన ఓ యువకుడు త్రిబుల్ రైడ్ చేయడంతో ట్రాఫిక్ పోలీసులు పట్టుకుని బైక్‌ను పీఎస్‌కు తరలించారు. సదరు యువకుడు మూడు రోజుల తర్వాత పీఎస్‌కు వచ్చి చలాన చెల్లించడానికి వస్తే బైక్ కనిపించలేదు. యువకుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లోనే బైక్ దొంగతనం జరగడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై ట్రాఫిక్ సీఐ ప్రసాద్‌ను వివరణ కోరగా బైక్ పోయిందని యువకుడు ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తెచ్చారని, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 26 మందికి జరిమానా

ఖలీల్‌వాడి: మద్యం తాగి వాహనాలు నడిపిన 26 మందికి జరిమానాలను మెజిస్ట్రేట్ విధించినట్లు ట్రాఫిక్ సీఐ పి ప్రసాద్ గురువారం పేర్కొన్నారు. ట్రాఫిక్ పీఎస్‌లో కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం 26 మందిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా మెజిస్ట్రేట్ నూర్జహాన్ వారికి రూ. 41వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ పేర్కొ న్నారు .

పేకాటస్థావరంపై దాడి

నందిపేట్: మండలంలోని మాయాపూర్ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 9 మందిని అరెస్టు చేయగా వారి నుంచి రూ.9500 నగదు, 8 సెల్ ఫోన్లు, 8 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చిరంజీవి పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.